‘ఉక్కు’ ఉద్యోగుల ఆర్థిక వెతలు

ఒకప్పుడు స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగమంటే ఓ భరోసా. ఉద్యోగ భద్రత, ప్రతీ నెలా ఠంచనుగా జీతం, అలవెన్సులు .. ప్రశాంతమైన జీవనం. ఇదంతా గతం..

ప్రస్తుతం.. ఒక్క నిర్ణయం వేలమంది జీవితాలను అభద్రతా భావంలోకి నెట్టేసింది. ప్రైవేటీకరణ దిశగా కేంద్రప్రభుత్వం వేస్తున్న అడుగులు ఆందోళనకు దారి తీశాయి. 1250 రోజులకు పైగా కార్మికులు దీక్షలు చేస్తున్నా ఫలితం కానరాకపోగా.. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి తగ్గిపోవడం, ముడిసరకు కొరత వంటి సమస్యలకు తోడు సమయానికి వేతనాలు అందకపోవడం.. అదీ సగం సగం వేయడంతో ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పీఎఫ్, థ్రిఫ్ట్ రుణాలు కూడా అందకపోవడంతో ఆర్థిక పరిస్థితులను అధిగమించేదెలా అని ఆందోళన చెందుతున్నారు.

- సమయానికి అందని వేతనాలు
- పీఎఫ్, థ్రిఫ్ట్ రుణాలూ లేవు
- ప్రైవేట్ వడ్డీలే ఆధారం
- భారమవుతున్న జీవనం



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఆర్థిక కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఒక వైపు వేతన సవరణ జరగక ఏడేళ్లుగా సతమతమవుతున్న ఉద్యోగులకు సగం జీతాల తిప్పలతో పాటు ఇంతకు ముందు వరకు ఉద్యోగులకు అండగా ఉండే పీఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీ రుణాలు కూడా సకాలంలో అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో ఉద్యోగులు బయట ప్రైవేటు వడ్డీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం జరిగిన తర్వాత స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల రాతలు పూర్తిగా మారిపోయాయి. 2017 జనవరి 1 నుంచి జరగాల్సిన వేతన ఒప్పందంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత ప్లాంట్‌పై ముప్పేట దాడి ప్రారంభమైంది. అప్పటి నుంచి ఉత్పత్తి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఉత్పత్తి లేకపోవడంతో టర్నోవర్ తగ్గిపోయి స్టీల్‌ప్లాంట్ నష్టాల బాట పట్టింది. రోజురోజుకు క్షీణించిపోతున్న ఆర్థిక పరిస్థితుల కారణంగా గత ఆరు నెలలుగా ఉద్యోగులు జీతం మొత్తం ఒకేసారి అందుకున్న దాఖలాలు లేవు. సగం జీతం చొప్పున.. అదీ నెలాఖరున చెల్లిస్తుండటంతో ఉద్యోగుల కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సకాలంలో జీతాలు అందక గృహ, వాహన రుణాలకు డిఫాల్టర్లుగా మారుతున్నారు. ఈ పరిస్థితిలో వేతన సవరణను మరిచిపోయి కనీసం నెల జీతం సక్రమంగా వస్తే బాగుణ్ను అనే పరిస్థితి ఉద్యోగుల్లో నెలకొంది.

అందని రుణాలు

ఇంత వరకు ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తీర్చేందుకు పీఎఫ్ రిటర్నబుల్ లోన్, థ్రిఫ్ట్ సొసైటీ రుణాలు అండగా ఉండేవి. ఉద్యోగులు తమ పీఎఫ్ నుంచి ప్రతీ ఆరు నెలలకు ఒకసారి లోన్ తీసుకునే అవకాశం ఉండేది. అదేవిధంగా థ్రిఫ్ట్ సొసైటీ లాంగ్ టర్మ్ లోన్, షార్ట్ టర్మ్ లోన్ పేరిట రెండు రకాలు రుణాలు ఇచ్చేది. వాటిని దాదాపు అందరూ ఉద్యోగులు వినియోగించుకునే వారు. అదే విధంగా ఉద్యోగులు తమ భవిష్యత్ అవసరాల కోసం థ్రిఫ్ట్ సొసైటీకి చెందిన థ్రిఫ్ట్ ఫండ్, వలంటరీ థ్రిఫ్ట్ ఫండ్ అనే పథకాల్లో పొదుపు చేస్తుంటారు. వారి అవసరాలకు అందులోంచి 80 శాతం తీసుకునేవారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి ఉక్కు యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు ఉద్యోగి, యాజమాన్యం వాటాలు పంపడం నిలిపి వేసింది. అదే విధంగా థ్రిఫ్ట్ సొసైటీ రుణాల రికవరీ, ఉద్యోగుల పొదుపు సొమ్మును సొసైటీకి చెల్లించడం లేదు. గత ఆరు నెలలుగా యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు రూ. 270 కోట్లు, థ్రిఫ్ట్ సొసైటీకు రూ. 52 కోట్లు బకాయి పడటంతో పీఎఫ్ ట్రస్ట్ ఉద్యోగులకు సకాలంలో రుణాలు ఇవ్వలేకపోతోంది. ఉద్యోగులకు 2023–24 సంబంధించి పీఎఫ్ వడ్డీ కూడా చెల్లించలేదు. థ్రిఫ్ట్ సొసైటీ ఉద్యోగులకు కొత్త రుణాలు నిలిపి వేయడంతో పాటు పొదుపు సొమ్మును కూడా ఇవ్వటం లేదు. రిటైర్ అయిన వారికి రెండు, మూడు నెలలు తర్వాత సెటిల్‌మెంట్ చేస్తున్నారు. ఈ పరిస్థితులు ఉద్యోగులను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. విదేశాల్లో, బయట రాష్ట్రాల్లో చదువుతున్న తమ పిల్లల జాయినింగ్, ఆగస్టులో పిల్లల వివాహాలు పెట్టుకున్నవారు అవసరమైన డబ్బు కోసం ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పీఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీల నుంచి రుణాలు అందకపోవడం వల్ల బయట అధిక వడ్డీ రుణాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాంట్ యాజమాన్యం ఇస్తేనే..

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగుల రుణ రికవరీ, పొదుపు రికవరీలను సొసైటీకి ఆరు నెలలుగా చెల్లించడం లేదు. దానివల్ల ఉద్యోగులకు లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ రుణాలు, పొదుపు సొమ్మును ఇవ్వలేక పోతున్నాం. రిటైర్ అయిన వాళ్లకు సెటిల్‌మెంట్ కూడా సకాలంలో చేయలేకపోతున్నాం. సొసైటీకి ఇవ్వాల్సిన సొమ్ము గురించి యాజమాన్యంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నాం. అలాగని బయట నుంచి రుణాలు తెచ్చే పరిస్థితి లేదు. –కె. దామోదర రెడ్డి, చీఫ్ మేనేజర్, స్టీల్‌ప్లాంట్ థ్రిఫ్ట్ సొసైటీ

ఇలాగైతే ఉద్యోగులు ఎలా బతకాలి?



యాజమాన్యం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. కార్మిక చట్టం ప్రకారం చెల్లించాల్సిన పీఎఫ్‌ను ట్రస్ట్‌కు ఇవ్వడం లేదు. థ్రిఫ్ట్ సొసైటీ రికవరీ నిలిపివేశారు. ఇలాగైతే ఉద్యోగులు తమ పిల్లల చదువులు, పెళ్లిళ్లు వంటి వాటిని ఎలా చేయగలరు? యాజమాన్యం ఆలోచించాలి. పీఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీలకు చెల్లింపులు చేయాలి. – ఎన్. రమేష్‌కుమార్, స్టీల్ ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు,

క్లుప్తంగా

సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంట్ పరిశీలన



వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డులోని సిద్ధార్థనగర్ నీటి శుద్ధి ప్లాంట్‌ను కార్పొరేటర్ బొండా జగన్ శనివారం పరిశీలించారు. ఆటోనగర్ పారిశ్రామిక వ్యర్థాల వల్ల నీరు కలుషితం అవుతోందని పరిసర కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో ఆయన ఈ ప్లాంట్‌ను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఏఈ కేదార్‌నాథ్, స్థానిక నాయకులు రాజన్‌రాజు, జోసెఫ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘ఏ ఫిల్మ్ బై రవిశెట్టి’ పోస్టర్ ఆవిష్కరణ



చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యూపోర్టు ఎస్ఐ శ్యామ్ సుందర్

పెదగంట్యాడ: గాజువాకకు చెందిన యువకులు చిత్ర పరిశ్రమలో నిలదొక్కుకుని సమాజానికి ఉపయోగపడే చిత్రాలు రూపొందించాలని న్యూపోర్టు ఎస్ఐ శ్యామ్‌సుందర్ ఆకాంక్షించారు. ఆర్‌ఎస్ మూవీ పతాకంపై నూతన నటీనటులతో రూపొందించిన ‘ఏ ఫిల్మ్ బై రవిశెట్టి’ చిత్రం పోస్టర్‌ను, ఫస్ట్ లుక్‌ను న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్శకుడు దివాకర్, నటుడు రవిశెట్టి, కెమెరామన్ ఉదయ్ కుమార్,ఏఎస్ఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

‘ఏపీవీవీపీ ఎంప్లాయిస్’ సభ్యుడిగా శంకరరావు



శంకరరావు

అగనంపూడి: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యునిగా అగనంపూడికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ మీసాల సూర్య శంకరరావు ఎన్నికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు శంకరరావును కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావును జిల్లా కమిటీ అభినందించింది.

మాల్స్‌లో ‘ఆస్రా’ ప్రతినిధుల తనిఖీలు



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఆస్రా ప్రతినిధి

గాజువాక: ప్రభుత్వ ఆదేశాలతో వివిధ మాల్స్‌లో విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు నాణ్యతను, ధరల అమలును ఆస్రా (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) ప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఆస్రా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ తోట శత్రుఘ్నుడు ఆధ్వర్యంలో ప్రతినిధులు స్థానిక స్పెన్సర్స్‌లో బియ్యం, కందిపప్పు అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలుదారుల అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వ ఆదేశం ప్రకారం కిలో బియ్యం రూ.49కి, కిలో కందిపప్పు రూ.160కి విక్రయించాల్సి ఉండగా..అంతకంటే తక్కువ ధరలకే విక్రయిస్తున్నారని, నాణ్యతపై కూడా వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారని శత్రుఘ్నుడు తెలిపారు. కాగా, ప్యాకింగ్‌లపై తూనికలు, కొలతల విభాగం అధికారులు కూడా తనిఖీలు నిర్వహించాలని తాము కోరినట్లు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అంశాలపై అసెంబ్లీలో చర్చిస్తాం

విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



ఎమ్మెల్యేతో చర్చిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన మూడు అంశాలపై రాష్ట్ర అసెంబ్లీలో చర్చించే నిమిత్తం అసెంబ్లీ సెక్రటరీకి నోట్ పంపినట్లు విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సమస్యలపై శనివారం ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు ఎమ్మెల్యేను కలవగా ఆయన వారికి ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర శాసనసభ 39వ నిబంధనను అనుసరించి ఈ అంశాలను లేవనెత్తనున్నట్టు తెలిపారు. గర్భాం మాంగనీస్ మైన్ రెన్యువల్ చేయడం, విద్యుత్ బిల్లుల బకాయిలు ఆరు నెలల పాటు వాయిదా వేయడం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్లు అడ్వాన్స్ చెల్లించి విశాఖ ఉక్కు ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులలో, హౌసింగ్ స్కీముల్లో వినియోగించే విధంగా కోరడంపై చర్చించనున్నట్లు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ ఉన్నారు.

శ్రీవారికి సహస్ర పుష్పార్చన



స్వామివారికి సహస్ర నామార్చన చేస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీవారికి సహస్ర నామార్చన నిర్వహించారు. విశేష పుష్పాలతో అర్చన అనంతరం నక్షత్ర హారతి, కుంభ హారతి సమర్పించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

సందేశాత్మక చిత్రం ‘బ్రహ్మా సో విష్ణు’



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి, ధర్మశ్రీ

గాజువాక: ప్రజాపిత బ్రహ్మ బాబా జీవిత చరిత్రపై రూపొందించిన బ్రహ్మా సో విష్ణు చిత్రం సందేశాత్మకమైందని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. సినిమా విడుదల సందర్భంగా స్థానిక లక్ష్మీకాంత్ థియేటర్‌లో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో కక్షలు, వేధింపులతో ప్రాణాలను తీసుకుంటున్న మనుషులకు ఈ సినిమా కనువిప్పు కలిగిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజల్లో పేద, ధనిక తేడా లేకుండా అందరూ సుఖంగా ఉండటం కోసం ప్రజాపిత బాబా చేసిన త్యాగాలపై సినిమా తీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా బ్రహ్మ కుమారి సంస్థ కో–ఆర్డినేటర్ సోమేశ్వరి, అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ప్రజాపిత దివ్యజ్యోతి భవన్ ఇన్‌చార్జి రామకోటి, వివిధ శాఖల ప్రతినిధులు అవరంజి, మణి, లలిత, వి.సత్య శ్యామల, మమత, శ్రీను, సియ్యాది సత్యారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



తుంగ్లాంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సిబ్బంది సూచించారు. సీజనల్ వ్యాధులపై 69వ వార్డు రెడ్డితుంగ్లాంలోని వేమన మందిరం వద్ద స్థానికులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం, మలేరియా సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ఆర్‌జీబీ క్యాంపెయిన్‌లో భాగంగా తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్థాలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులను అరికట్టడంతో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఈ విషయంలో సహకరించాలని కోరారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల వ్యాప్తికి కారణమైన వాటిని గుర్తించి తొలగించాలని తెలిపారు. దోమతెరలను, దోమల నివారణా కారకాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.అప్పలరాజు, ఆర్పీ అంజలి, సచివాలయం హెల్త్ సెక్రటరీ వరలక్ష్మి, ఎస్.నాగేశ్వరరావు, జయరాజు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: గురు పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో సాయినాథుని రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం రథంపై బాబా ఉత్సవ మూర్తిని ఉంచి, ఊరేగించారు. సమతానగర్, వుడా కాలనీ, వెంపళ్లనగర్, కొత్త కర్ణవానిపాలెం, నడుపూరు మీదుగా రథోత్స వం సాగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, సాయి సేవకులు పాల్గొన్నారు.

వర్షాలకు నాని.. కూలిన రక్షణగోడ



శిథిలాలను తొలగిస్తున్న కాలనీ వాసులు

- దెబ్బతిన్న రెండు ద్విచక్ర వాహనాలు
- స్థానికుల చొరవతో శిథిలాల తొలగింపు



కూలిన రక్షణ గోడ శిథిలాల కింద ఉన్న ద్విచక్ర వాహనాలు

మల్కాపురం: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌సంజీవ్‌కాలనీ కొండ ప్రాంతంలో రక్షణ గోడ శనివారం ఉదయం 5 గంటల సమయంలో కూలింది. నిద్రలో ఉన్న ఆ ప్రాంత వాసులు గూడ కూలిన శబ్దంతో ఉలిక్కి పడి లేచారు.రక్షణ గోడ కూలడం, శిథిలాల కింద ద్విచక్ర వాహనాలు చిక్కుకోవడం గమనించారు. వర్షాలకు రక్షణ గోడ దిగువగల మట్టి కరిగి గోడ కూలిందని కాలనీ వాసులు చెబుతున్నారు. స్థానిక యువకులు శిథిలాలను తొలగించి రెండు ద్విచక్ర వాహనాలను బయటకు తీశారు. ఆ వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ములగాడ మండల రెవెన్యూ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు ఆ ప్రాంతానికి వచ్చి ప్రమాదంపై విచారించారు.

బీజేపీ బలోపేతానికి సమష్టి కృషి



నాయకులకు నియామక పత్రాలను అందజేస్తున్న కరణంరెడ్డి

గాజువాక: గాజువాకలో బీజేపీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. పార్టీలో కొత్తగా పదవులు పొందిన పలువురికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో పార్టీపట్ల అనేకమంది ఆకర్షితులవుతున్నారన్నారు. అలాంటివారిని గుర్తించి సభ్యత్వం కల్పించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి నియోజకవర్గంలోని 20 వార్డులలో సమావేశాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఒమ్మి రంగనాయకులు, పి.నాగేశ్వరరావు, బొత్స దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ముందుకొచ్చిన సముద్రం



జోడుగుళ్లపాలెం వద్ద తీరంలో ముందుకొచ్చిన సముద్రం నీరు

ఆరిలోవ: వాయుగుండం ప్రభావంతో సముద్ర కెరటాలు ఎగిసిపడుతున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీరంలో నీరు మరింత ముందుకొచ్చింది. జోడుగుళ్లపాలెం, సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద గతంలో కంటే ముందుకు చేరింది. ఒడ్డున విశాలమైన ఇసుక దిబ్బలు సగానికి పైగా మునిగిపోయాయి. సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద రాళ్లకు కొంత దూరంలో ఉండే నీరు ఇప్పుడు వాటిని దాటి ముందుకు వచ్చింది. దీంతో బీచ్ లోపలకు సందర్శకులు ఎవరూ వెళ్లే సాహసం చేయకుండా రోడ్డు మీద నుంచే కెరటాలను తిలకిస్తున్నారు.

దారులన్నీ సింహగిరి వైపే..





- గిరిప్రదక్షిణకు పయనమైన గాజువాక వాసులు
- కిటకిటలాడిన బస్‌లు, ఆటోలు



గిరి ప్రదక్షిణకు గాజువాక ప్రాంతం నుంచి భక్తులు పోటెత్తారు. నివాస ప్రాంతాల నుంచి బృందాలుగా బయలుదేరి వేలాదిగా తరలి వెళ్లారు. దీంతో గాజువాకలోని వివిధ బస్ స్టాప్‌ల వద్ద రద్దీ నెలకొంది. బస్సులు, ఆటోలు కిటకిటలాడాయి. ఆర్టీసీ బస్సులన్నీ సింహాచలంవైపే తిరిగాయి. ఆటోలు కూడా గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులతోనే నిండిపోయాయి. గాజువాక ప్రాంతం నుంచి బయల్దేరిన భక్తులు నేరుగా సింహాచలం తొలిపావంచాకు చేరుకుని అక్కడి నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. దీంతో భక్తులు బస్సులు, ఆటోలను ఆశ్రయించారు. కాగా, కొంతమంది తమ సొంత రవాణా ఏర్పాట్లతో సింహాచలం బయల్దేరి వెళ్లారు. - గాజువాక

అప్పన్న భక్తుల సేవలో.. స్వచ్ఛంద సంస్థలు



పాత గోశాల వద్ద భక్తులకు పొంగలి అందజేస్తున్న ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ అధినేత బి.వి. కృష్ణారెడ్డి



రైతుమిత్ర ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ



అడవివరంలో భక్తులకు పులిహోర అందజేస్తున్న భూలోక యూత్ ఫ్రెండ్స్

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులకు దారి పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలతో పాటు పలు కుటుంబాల వారు తరించారు. తమకు తోచిన రీతిలో వితరణ చేపట్టారు. పరోక్షంగా అప్పన్న సేవలో మునిగారు. ఆహార పదార్థాలు, పానియాలు, ప్రసాదం,టిఫిన్స్, చాక్లెట్లు, టీ, బిస్కెట్లు విరివిగా అందజేశారు. అడవివరం, పాత అడవివరం నుంచి పైనాపిల్ కాలనీకి వెళ్లే మార్గంలో భక్తులకు సేవలందించారు.

- పాత గోశాల వద్ద ఎస్ఎన్ఆర్ కల్యాణమండపం అధినేత బి.వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బోండా, పొంగలి నిర్విరామంగా అందజేశారు.
- హైదరాబాద్‌కి చెందిన కందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు అల్పాహారం పంపిణీ చేశారు. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా 100 మంది వంట బృందాన్ని తీసుకొచ్చారు.
- గురురాజ సంపత్ వినాయక ఏజెన్సీస్ ఆధ్వర్యంలో పులిహోర, బిర్యానీ, శనగలు, ఉప్మా, స్వీట్లు అందజేశారు.
- అడవిరం ప్రధాన రహదారి వద్ద భూలోక యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎర్ర వరహా నరసింహం, యర్ర మణిదీప్, శిడగం రామకృష్ణ, శిడగం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.
- అడవివరంలోని ఎంపీపీ స్కూల్ వద్ద అడవివరం నివాసితులు ఫణిమనోహర్, సతివాడ శంకర్రావు, బున్ని ఆధ్వర్యంలో పులిహోర, గ్లూకోజ్ అందజేశారు.
- ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో పులిహోర, సత్యనారాయణస్వామి ప్రసాదం, చక్కెర పొంగలి, శనగలు పంపిణీ చేశారు.